
ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 3 పుష్పం : 7-9 20-10-2001

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 7** **ISSUE : 4**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## కర్మబద్ధులు

ఆత్మజ్ఞానం సంపాదించేవరకు కర్మఫలం వెంటాడుతూనేఉంటుంది. కర్తృత్వంతో కర్మనుఆచరిస్తే పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం, ఎత్తుకుఎత్తు అనుభవించాలి. మనిషికూడా తన నీడ వెంబడించినట్లు అహంభావికూడా కర్మఫలం వస్తూనేఉంటుంది. కర్తృత్వమును ఈశ్వరుడు కల్పించలేదు. మాయకర్తృత్వమును కల్పించింది, ఉన్నది బ్రహ్మమే. అదిమాత్రమే సత్యము. మాయకారణంగా బ్రహ్మమే లోకముగా కన్పిస్తున్నది. కర్తృత్వము దాటినవాడిని కర్మఫలము అంటదు. కర్తృత్వబుద్ధి నశించిన మరుక్షణంలో మనం ఎవరమో మనకు తెలియబడుతుంది. ఆత్మ మనకు స్వరూపంగా వ్యక్తం అవుతుంది. ఆత్మదర్శనము పొందుటకు సాధన అవసరము. తగినంత వినయసంపదలేకుండా సాధన సాధ్యంకాదు. భగవంతుడిపట్ల భక్తిలేకుండా వినయంరాదు. భగవంతుడిని పొందుటకు భక్తిమార్గము అత్యంత సహజమైనది, నిదానమైనది. ఏమార్గములో ప్రయాణంచేసినా మనస్సును దాటకుండా ఆత్మఅందదు. రాగద్వేషములులేకుండా, హెచ్చుతగ్గులులేకుండా జీవకోటిని ప్రేమించుటవలన మనస్సు నశిస్తుంది. మనస్సు నశిస్తేనేకాని స్వేచ్ఛకలుగదు, సుఖముతెలియదు. మాయకార్యమైన మనస్సు నశిస్తే అమృతానుభవము కల్గుతుంది. ఆత్మాన్వేషకుడు కష్టాన్ని ఇష్టంగా అనుభవించాలి. కర్మఫలముపట్ల అపేక్షపనికిరాదు. కర్మఫలాన్ని ఆశిస్తే అశాంతి. కర్మఫలాసక్తి లేనివాడికి శాంతి.

సత్యాన్వేషకుడు నేర్చుకోవలసింది త్యాగము. త్యజించవలసినది భోగము. త్యాగిని జ్ఞానము వరిస్తుంది. భోగిని కర్మఫలము బంధిస్తుంది. ఆసక్తితో పనిచేసేవాడిని అశాంతి వెంటాడుతుంది. మానవుడికి తెలిసినా తెలియకపోయినా జరిగేదంతా భగవంతుని సంకల్పంతోనే జరుగుతోంది. ఈ విషయం గ్రహించినవాడికి కర్తృత్వబుద్ధి పల్చబడుతుంది. దుఃఖము కర్తృత్వరూపములో ఉన్నది. కర్తృత్వము నశిస్తేనేకాని దుఃఖమునశించదు. మనమతమునకు ఒకపేరులేదు. మనమతము ఎవరో ఒకరిచేత స్థాపింపబడినదికాదు. అది ఒకధర్మము, జీవితవిధానము. కర్తృత్వము ఉన్నంతకాలము కర్మఫలమునకు బద్ధుడుకావలసినదే. మనం ఎలాజీవిస్తే, ఎలా ఆలోచిస్తే, ఎలామాట్లాడితే కర్తృత్వబుద్ధిరూపంలోఉన్న మాయనుండి విడుదలపొందగలమో అట్టి జీవితవిధానమును మన సనాతనధర్మం మనకునేర్పింది. ధర్మాన్ని ఆచరించినవాడికి అన్నీవస్తాయి; మోక్షంకూడావస్తుంది.

\- సద్గురు శ్రీనాన్నగారు

**ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

27-09-2001 భీమవరం ........ 3
03-10-2001 ఫత్తేపురం ........ 6
14-10-2001 విశాఖపట్నం ........ 12

ఓం నమో భగవతే శ్రీరమణాయ నమః

# రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 27-09-01, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీవు ఏపనిచేసినా ప్రేమతోచెయ్యి, ఆసక్తిలేకుండాచెయ్యి, శోఖరహితుడవై పనిచెయ్యి. ఏదోవస్తుందని ఆశించి మంచిపనిచెయ్యకు, లోకంలో గొప్పలకోసం మంచిపనులుచెయ్యకు. మంచి మంచికోసమేచెయ్యి. అప్పడు భౌతికంగానూ నీజీవితం బాగానేఉంటుంది, భగవదనుగ్రహానికి పాత్రుడవుఅవుతావు. మనిషి బ్రతికిఉండగా వాడిని జాగ్రత్తగాచూడండి. ఎప్పడు చనిపోతాడుఅని ఎదురుచూడవద్దు, బాధపడవద్దు, వాడిని ప్రేమతోచూడండి. ఆ మనిషి చనిపోయినతరువాత వాడిగురించి దుఃఖపడవద్దు. ఆ మనిషిఉన్నప్పడు ఎలాఉన్నారో తరువాతకూడా అలాగే ప్రవర్తించండి అని భగవంతుడు చెప్పాడు. దేహం మరణించినతరువాత ఏ జీవుడుఅయితే ప్రయాణంచేస్తున్నాడో వాడిలోఉన్న జీవలక్షణాలుపోవాలి. ఆ జీవలక్షణాలు పోతేగాని మీకుజ్ఞానంకలుగదు. జీవలక్షణాలు పోగొట్టుకోవటానికి మీమనస్సుకు ఏమార్గం నచ్చితే ఆమార్గంలో ప్రయాణించి వాటిని తొలగించుకోండి. భగవంతుడుఅనేవాడు ఒకడుఉన్నాడుఅని పరిపూర్ణమైనవిశ్వాసంఉన్నవాడికి శరణాగతిమార్గం కుదురుతుంది. నీకు శరణాగతిమార్గం కుదిరితే ఇతర మార్గాలతో పనిలేదుఅన్నారు భగవాన్. కొంతమంది ప్రతీదానికి అనుమానించే మనుషులు ఉంటారు, వారికి విచారణామార్గం మంచిది. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా మిధ్యానేనులోనుండి బయటకురావాలి.

నేను అదిచేసాను, నేనుఇదిచేసాను, నేనుఅదిసాధించాను, నేనుఇదిసాధించాను అనిఅనుకోవద్దు. ఇదిఅంతా నీదేహానికి, మనస్సుకు, ఇంద్రియాలకు సంబంధించిన విషయం. ఆత్మకు వీటితో సంబంధంలేదు. ఈలోకంలో పనిచేసి పొందవలసింది ఏమీలేదుకాని పనిచేస్తున్నాను అని కృష్ణుడుచెప్పాడు, అదిఆత్మ. నీదేహం, ఇంద్రియాలు, మనస్సుపనిచేస్తున్నా, నేనుఏమీపనిచేయటంలేదు ఈ పనికి నాకు ఎట్టిసంబంధంలేదు అనే అనుభవం నీకు ఎప్పడు వచ్చిందో అదే నీకు చివరిజన్మ. నీవు ఎవరికైనా ఉపకారంచేస్తే ఉపకారంచేసాను అనుకొంటున్నావు, ఎవరికైనా అపకారంచేస్తే అపకారంచేసాను అనుకొంటున్నావు, ఇవిఅన్నీ మనస్సుకు, దేహానికి సంబంధించినవిషయాలు, అంటే నీవు మనస్సుచుట్టూ, దేహంచుట్టూ





తిరుగుచున్నావు. నీకు వైరాగ్యంలేదు. ఇంకనీకు జ్ఞానంఎలాకలుగుతుంది? నిద్రలోనీకు స్వప్నాలు ఎలావస్తాయో అలాగ అజ్ఞానంలోఉన్నంతవరకు నీకు జన్మలువస్తాయి. నిద్రలోవచ్చే స్వప్నాలు ఎంతనిజమో, అజ్ఞానంలోవచ్చే ఈజన్మలుకూడా అంతేనిజం. ఏదైనా మంచికలవచ్చినా ఏదైనా చెడ్డకలవచ్చినా మెలుకువవచ్చాక అదిఅంతా అబద్ధం అనినీకుతెలుస్తుంది. అలాగే అజ్ఞానం నశించి నీకుబ్రహ్మానుభవం కలిగినపుడు ఈజన్మలు, చావులు, పుట్టుకలు ఇవి ఏమీనిజంకాదు, ఇదిఅంతాఅసత్యం అనినీకుతెలుస్తుంది. ఈ శరీరానికి మరణం వచ్చేలోపు బ్రహ్మానుభవంపొందు. అప్పడు ఇంకనీకు ప్రయాణాలతోపనిలేదు. ఉన్నదేదోఉంది, లేనిదిఏదోలేదు, ఉన్నదానినినీవులేదు, లేదుఅనుకొన్నా ఉన్నదానికి లేకపోవటం అంటూలేదు. లేనిదానిని నీవుఉంది, ఉందిఅనుకొన్నా అదిఉండదు. ఈ విషయం నీవు అర్ధంచేసుకోవాలి. అప్పడుగాని నీకుతత్వంతెలియదు. ప్రతీమనిషికి ఎంతోకొంతశక్తిఉంటుంది. ఆశక్తిని చిల్లరగొడవలకు ఖర్చుపెట్టుకొంటున్నారు. డబ్బు విషయంలో మీరు ఎలా జాగ్రత్తగా ఉంటున్నారో, ఎలాసద్వినియోగంచేసుకొంటున్నారో అలాగే మీజీవితాన్ని సద్వినియోగంచేసుకోండి. మీశక్తిని బాహ్యంగావెళ్ళనివ్వవద్దు. మీశక్తిని చిల్లరవిషయాలకుఖర్చుపెట్టవద్దు, చిల్లరవిషయాలకు ఖర్చుపెడితే మరణానంతరజీవితంలోసున్న. శక్తితో లోపలకువెళ్ళినవాడికి జ్ఞానంకలుగుతుంది. ఇప్పడు మనమనస్సు ఎంతవేగంగా బయటకువస్తోందో అంతవేగంగా లోపలకువెళితే అంటే హృదయాభిముఖంగా ప్రయాణంచేస్తే ఇప్పడే ఈజన్మలోనే మహాజ్ఞానివిఅవుతావు. శ్రవణంచేస్తున్నారుగాని చాలామంది ఇంటిదగ్గర సాధనఏమీచేయటంలేదు. శ్రవణంచేసినదానినిమననంచేస్తే అదిమీకు అనుభవంలోనికి వస్తుంది. అనుభవంలోనికి వచ్చినది మీకుఉపయోగపడుతుంది.

ద్వైతం, అద్వైతానికిదారితీస్తుంది. ఇంతకాలం నీవూఉన్నావు, నేనూఉన్నాను అనిఅనుకొంటున్నాను. నిన్ను తెలుసుకొన్నాక తెలిసింది నీవేఉన్నావు, నేనులేనుఅనితెలిసింది అన్నారు నమ్మాళ్వార్. ద్వైతంలోనుండి ద్వేషంవస్తుంది, ద్వైతంలోనుండి భయంవస్తుంది, ద్వైతంలోనుండి ఇష్టంవస్తుంది. ఉన్నదిఒక్కటే అయినప్పడు ఎవరినిచూసి ఇష్టపడతాము? ఎవరినిద్వేషిస్తాము? ఎవరినిచూసినా వారిలోఉన్న పెరుమాళ్ళునేచూడు. మంచిచెడ్డలుఅన్నీ మనస్సులోఉన్నాయి. అందువలన ఆ మనస్సును తీసిఒకప్రక్కనపెట్టు. నీవుఏదికాదుఅని నేనుచెపుతున్నానో దానిని భుజానవేసుకొని తిరుగుతున్నావు. మనస్సు నీవుకాదుఅని నేనుచెపుతున్నాను. కాని నీవుదానితో తాదాప్యంపొందుతున్నావు. ఆతాదాప్యాన్ని వదిలెయ్యి.

ఆతాదాప్మ్యాన్ని వదలలేవుఅనుకో జన్మజన్మలకు ఆమనస్సు నీకూడానేఉంటుంది. నీవుపనిచెయ్యి, ఆసక్తిలేకుండాపనిచెయ్యి, శోఖరహితుడవైపనిచెయ్యి, అభిమానంలేకుండా పనిచెయ్యి అప్పడు నీవుపవిత్రుడవు అవుతావు. నీమనస్సుకు ఎప్పడైతే ఏకాగ్రతవచ్చిందో, పవిత్రతవచ్చిందో అప్పడు దానికి లోచూపుకలుగుతుంది. లోపలఉన్నవస్తువు దానికిదొరికినా, దొరకకపోయినా లోపలఏముందో వెతకటం ప్రారంభిస్తుంది. అదేసత్యాన్వేషణ. ఉన్నది అంతాలోపలేఉంది, బయటఏమీలేదు కాని మనబుద్ధిలోఉన్నదోషంవలన బయటఏదోఉంది అని మనకు అనిపిస్తుంది. లోపలఉన్నచైతన్యానికి ఏమీఅక్కరలేదు. మనస్సుకే దేహంకావాలి, లోకంకావాలి. మనస్సులోవచ్చే ప్రతీ వికారంయొక్క ప్రభావం దేహంమీదపడుతుంది. భగవంతుడిలో అనేక కళ్యాణగుణాలుఉన్నాయి. ఆగుణాలు మనకులేవు, మనకులేవుఅనిఅనుకోకూడదు. ప్రయత్నంచేసి వాటిని సంపాదించుకోవాలి.

భగవంతునియందు గౌరవంకలిగిఉండండి. సొంతబుద్ధిని విడిచిపెట్టవద్దు. స్వార్థం కొంచెంతగ్గించుకొని ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడాలి. దానివలన ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. మీకుతెలిసిన మంచి ఇతరులకు చెప్పవచ్చు. దానివలన మీమంచితనంపెరుగుతుంది. జీవితంలో కష్టసుఖాలువస్తూఉంటాయి. వాటిమధ్యన నలిగిపోవద్దు. మీదేహప్రార్ధములో ఏదిఉందోఅదివస్తుంది, ఇవిఅన్నీ లోకానికి సంబంధించిన విషయాలు. వీటిని దృష్టిలోపెట్టుకొని గమ్యాన్ని మర్చిపోవద్దు. గమ్యాన్ని మర్చిపోతే చిరాకులు, పరాకులు పెరుగుతాయి. పొందవలసిన వస్తువును గుర్తుపెట్టుకోవటంవలన మీకుఎన్నికష్టాలువచ్చినా వాటిని తేలికగా భరించగలరు. రైలు గంట ఆలస్యంగావస్తోందిఅనుకోండి ప్రయాణంమానివేసి ఇంటికివచ్చేస్తామా? ఇంటికితిరిగివెళ్ళము, అక్కడేఉంటాము, వెళ్ళవలసిన గమ్యాన్ని గుర్తుపెట్టుకొంటాము. అలాగే పొందవలసిన వస్తువును గుర్తుపెట్టుకోండి. ధర్మార్థకామాలదగ్గర ఆగిపోవద్దు, ఇవిఅన్నీ స్వప్నసమానము. మీరు పొందవలసినమోక్షాన్ని, శాంతిని మర్చిపోవద్దు. చిల్లరవిషయాలను దృష్టిలోపెట్టుకొని అసలు వస్తువును వెతకటంమానకండి, ఆత్మారాముడిని వెతకటంమానవద్దు.





ఓం నమో భగవతే శ్రీ రమణాయ నమః

# రమణ భాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 03-10-2001, పత్తేపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆత్మజ్ఞానముతో సమానమైనది ఈ సృష్టిలోఏమీలేదు. ఆత్మజ్ఞానంవలన మనకు శాంతికలుగుతుంది. భగవంతుడు చెప్పిన వాక్యంవేరు, భగవంతుడు వేరుకాదు. భగవంతుడు చెప్పినమాట భగవంతుడితో సమానము. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని గౌరవిస్తే, భగవంతునియొక్క భక్తులను గౌరవిస్తే భగవదనుగ్రహం మన శిరస్సుమీదపడుతుంది. భగవదనుగ్రహం లేకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మనకు అంతాతెలుసుఅని అనుకొంటాము. మనం గురువును ఆశ్రయించి, గురువుచెప్పినది శ్రద్ధగా శ్రవణంచేసినప్పడు ఇప్పటివరకు మనకు అంతా తెలుసు అనుకొన్నాము కాని మనకు ఏమీతెలియదుఅన్న సంగతి అప్పడు మీకు తెలుస్తుంది. గురువుచెప్పినది శ్రవణంచేయకపోతే అంతా మాకే తెలుసుఅనుకొంటాము, ఆమాటలు శ్రవణంచేసాక మనలో ఏదోవెలితి, కొరత ఉందిఅని మనకు ఏమీతెలియదు అని మీకు తెలుస్తుంది. జ్ఞానికి సాధన అక్కరలేదు, అజ్ఞానికి సాధన అక్కరలేదు. జ్ఞానికి సాధన ఎందుకు అక్కరలేదుఅంటే ఆయన సాధనచేసి, సాధనలో జయంపొంది బయటకు వచ్చాడు. అజ్ఞానికి సాధన విలువ తెలియదు అందువలన సాధన ప్రారంభించాలి అనిఅనుకోడు. ఇంక మనకు అటుజ్ఞానంఉందాఅంటే జ్ఞానంలేదు. పూర్తిగా అజ్ఞానంలోఉన్నామాఅంటే అలాకాదు. భగవంతుడు మనహృదయంలోఉన్నాడు. మన పూర్వీకులు అనేకమంది తపస్సులుచేసి ఆయనను తెలుసుకొన్నారు. అలాగే మనంకూడా ప్రయత్నంచేసి ఆయనను తెలుసుకోవాలనే కాంక్షలో మనంఉన్నాము. జ్ఞానం సంపాదించాలి అనుకొంటున్నాము. సాధన ప్రారంభించాముఅంటే యుద్ధంలో ప్రవేశించాము. పూర్వజన్మలనుండి మనం అనేక వాసనలు, అలవాట్లు మోసుకొనివస్తున్నాము, వాటివలననే లోపలఉన్న వస్తువు మనకు తెలియటంలేదు. ఆవాసనలనుండి, అలవాట్లనుండి బయటపడటానికి ఇప్పడు ప్రయత్నంచేస్తున్నాము. అంటే వాటిమధ్య యుద్ధం జరుగుతోంది. ఈ యుద్ధంలో ఎవరు నెగ్గుతారుఅంటే ఇది గొర్రె, పొట్టేల్లు దెబ్బలాటలాగ ఉంటుంది. గొర్రె, పొట్టేల్లు దెబ్బలాటలో బలమైన గొర్రె నెగ్గుతుంది, బలహీనమైన గొర్రె పారిపోతుంది. అలాగే

నీసాధన బలంగాఉంటే పూర్వజన్మలోనుండి వచ్చేవాసనలు పారిపోతాయి. నీసాధన బలహీనంగాఉంటే ఆవాసనలు నీసాధనను తరిమేసి వాసనలు ఉండిపోతాయి, అవివచ్చే జన్మకుకూడా వచ్చేస్తాయి. ఇప్పడు మనపరిస్థితి ఎలాఉందిఅంటే ఒకసంస్కారం పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము, ఇంకోసంస్కారం పోగుచేసుకొంటున్నాము. మనకు సరియైన గైడెన్స్‌లేక ఏదోఒకమార్గంలో కొంతదూరంవెళ్లటం ఇది సరియైనదికాదని మరల ఇంకోమార్గంలో ప్రయాణంచేయటం ఇలా తిరుగుతున్నాము. కౌరవుల సంఖ్యఎక్కువ, అందులో అనేకమంది వీరులుఉన్నారు. అలాంటివారిని పాండవులు జయించారు. అంటే పరమాత్మ సహాయంవలన పాండవులు జయంపొందారు. పరమాత్మ సహాయంలేకుంటే పాండవులు జయంపొందలేరు. అలాగే మీరు సాధనచేస్తూఉండాలి. ఈ శత్రువులబారినుండి నాసాధనవలన బయటపడలేను, నీ అనుగ్రహంకావాలిఅని పరమేశ్వరుని ప్రార్థించాలి. పరమాత్మ సహాయంవలన పాండవులు జయంపొందినట్లు అప్పడు మీరు సాధనలో జయంపొందుతారు, పూర్వజన్మలోనుండి వచ్చిన సంస్కారములుపోతాయి. మనకు లోపలశత్రువులు, బయటశత్రువులు ఉంటారు. మనకు కొంతతెలివిఉంటే, బలంఉంటే బయటశత్రువులను జయించగలము. కాని లోపలశత్రువులను జయించాలంటే ఈశ్వరానుగ్రహంఉండాలి. బయటశత్రువులను జయించినవాడు గొప్పవాడేగాని లోపలశత్రువులను జయించినవాడు నిజమైన గొప్పవాడు.

ప్రతిమనిషికి శత్రువులుఉంటారు. క్రీస్తుకు శత్రువులుఉన్నారు, బుద్ధుడికి శత్రువులుఉన్నారు, రమణమహర్షి తిరువణ్ణామలై వచ్చినప్పడు అనేకమంది ఆయనను బాధలుపెట్టారు. అయితే వారికి మనకు తేడాఏమిటిఅంటే ఈ దేహం ఆ బాధలుపడవలసిఉందిఅని వాటిని శాంతిగా భరిస్తారు. మనమనస్స వాటికి ఎదురుతిరుగుతుంది. మనం భరించినా చిరాకుగా భరిస్తాము. చిరాకుగా భరించేవాడికి ఈ జన్మలోనుఉంటుంది, వచ్చేజన్మలోకూడా ఆబాధసిద్ధమవుతుంది. శాంతిగా భరించేవాడికి వచ్చేజన్మలో ఇటువంటి బాధలురావు. అందువలన సాధుకుడికి చిరాకుపనికిరాదు. ఇదిమంచి, ఇదిచెడు అనినాకు తెలుస్తోంది. కాని నాకు చెడుమీద ఇష్టంకలుగుతోంది, మంచిమీద ఇష్టం ఉండటంలేదుఅని ఒకరుఅడుగుతున్నారు. భగవంతుడిని ప్రార్థించి మీరు సాధనచేస్తూఉంటే చెడుకు దూరమవుతారు, మంచిని అంటిపెట్టుకొని ఉంటారు. మీకోడలు తిడుతోందిఅనుకోండి వెంటనే మీకు దుఃఖంవస్తుంది. ఆ తిట్టటం మీరు అంగీకరించారుఅనుకోండి, అది ఆవిడ అలవాటు అనుకొంటే మీకు దుఃఖంరాదు. స్నేహాలు, విరోధాలు ఇవిఅన్నీ మనస్సు కల్పించినవే. ఇక్కడ ఆగిపోకూడదు. మనం పొందవలసినది వేరేఉంది. దానిని సాధించాలి అనే పట్టుదలఉండాలి. పొందవలసిన వస్తువును గుర్తుపెట్టుకోవాలి. అది గుర్తుపెట్టుకొంటే చిన్నచిన్న విషయాలను గడపదాటినట్లు తేలికగా దాటేయవచ్చు. ఆడంబరంగా వ్రాసే రచనలుగాని, ఆడంబరంగాచెప్పే ఉపన్యాసాలుగాని మీరుచదవకూడదు, మీరువినకూడదు. వాటివలన ఆడంబరంవచ్చేస్తుంది. మనం ఆడంబరంగా జీవిస్తూ ఆడంబరంలేని దేవుడిని తెలుసుకోవటం సాధ్యంకాదు. ఇతరులలో ఏబలహీనతలుఉన్నాయో చూడటంవలన ఏమీరాదు. ఇతరుల గొడవ నీకు అనవసరం. నీలోఉన్న బలహీనతలను చూసుకొని, వాటిలోనుండి బయటపడి నీవు బాగుపడే విధానంచూసుకో. అంతేగాని నీబలహీనతలు ఏమిటో నీవు చూసుకోకుండా ఇతరులలోని బలహీనతలు చెప్పటం వలన ప్రయోజనంలేదు, చివరకు పాపంవస్తుంది.

ప్రతీజన్మలోనూ మనం దేహంచుట్టూ, మనస్సుచుట్టూ తిరుగుచున్నాము. నీ మనస్సును శిలువవేసినప్పడే లోపలఉన్న తత్వం నీకుతెలుస్తుంది. దేహం మారినప్పడు చుట్టాలు మారిపోతారు, స్నేహితులుమారిపోతారు, పరిసరాలుమారిపోతాయి, కాని జీవుడిలోఉన్న వాసనలు అలాగేఉంటాయి. నీవు ప్రయత్నంచేసి వాటిని తొలగించుకోవాలి. వాసనా క్షయంఅయితే ఇంకనీకు దేహంరాదు. ఈదేహంచనిపోయి, ఇంకోదేహంలోనికి ప్రవేశించటం పునర్జన్మకాదు. నీహృదయంలో ఒకచావులేని వస్తువుఉంది. అది స్వయంగా ప్రకాశిస్తోంది. అందులోమేల్కోవాలి, ఆత్మలోమేల్కోవాలి అది నిజమైనపునర్జన్మ. ఎవరైనా నిన్ను విమర్శించినా, ఎవరైనానిన్ను స్తోత్రంచేసినా ఇదిదేవుడేచేస్తున్నాడుఅనే అనుభవం నీకుఉంటే ఇంక హెచ్చుతగ్గులురావు. మాపరిస్థితులు బాగున్నాయి, మాకురోజులుబాగా వెళ్లిపోతున్నాయిఅంటారు. మీదేహప్రారబ్ధమునుబట్టి మీకుధనంరావచ్చు, విద్యరావచ్చు, గౌరవంరావచ్చు. బాగుపడటంఅంటే ఇదికాదు నీవులోపలబాగుపడాలి. లోపలఎంత మార్పువస్తోందిఅది చూసుకోవాలి. జీవితం పొడుగునా దేహాన్ని పట్టుకొని వేలాడవద్దు. నీవు ఎంతవేలాడినా దేహం వెయ్యిసంవత్సరాలు ఉంటుందా? ఉండదు. మీపరిస్థితులు బాగాఉంటే జ్ఞానం సంపాదించుకోవటానికి ఆపరిస్థితులను ఉపయోగించుకోవటం మానివేసి మారోజులు బాగావెళ్లిపోతున్నాయిఅంటే ఏమిలాభం. సబ్జక్టుబాగా అర్థంచేసుకోండి. మీకు పరిస్థితులు అనుకూలంగాఉంటే వాటిని జ్ఞానం పొందటానికి సద్వినియోగం చేసుకోండి. వెంటనే

ఆత్మజ్ఞానం కలుగకపోయిన రాబోయేజన్మ ఉత్తమజన్మవస్తుంది. పరిస్థితులను దుర్వినియోగం చేసుకొంటే నీచజన్మలువస్తాయి.

మనకు పుట్టకతోనే కొన్నిగుణాలు ఉంటాయి. వాటిలోనుండి బయటకురావటం కష్టం. ఒకవేళ మనం నిగ్రహించుకొందాము అనుకొన్నా పూర్వజన్మనుండి వచ్చిన అలవాట్లయొక్క వేగం నిన్నుగెంటేస్తుంది. నదికి వరదవచ్చినప్పుడు ఆ ప్రవాహంలో మనకు ఈతవచ్చినా కొట్టుకొనిపోతాము. అలాగే పూర్వజన్మ సంస్కారములు ప్రవాహంలాగ వడిగావచ్చేస్తూఉంటే నీ నిగ్రహం ఎంతఅన్నాడుభగవంతుడు. అప్పుడు మనం సాధనచేయవచ్చుకాని ఓడిపోతాము. అలాగని నీవు ప్రయత్నం చేయటంమానకు. ఆయన అనుగ్రహంవస్తుంది. కేవలం నీసాధనవలన నీస్వభావంలోమార్పురాదు. బలం ఆయనే ఇవ్వాలి. జ్ఞానగంగ అటునుండి రావాలి. కొంతమంది శరీరందగ్గర, కొంతమంది మనస్సుదగ్గర, కొంతమంది తెలివిదగ్గర ఆగిపోతారు. ఈ గడపలు అన్నిదాటివెళితేగాని నీవులోపలకు వెళ్ళలేవు. చిన్నపిల్లవాడిని మీరు గురువుగా పెట్టుకోండి. వాడికి ఎంతడబ్బుఉన్నా నాకుడబ్బుఉందిఅని వాడుఅనుకోడు, వాడుఎంతఅందంగాఉన్నా నేను అందంగా ఉన్నానుఅనిఅనుకోడు నీవుకూడా అలాగ అయిపోతే నీకు జ్ఞానంవస్తుందిఅన్నాడు రామకృష్ణుడు. దేహంఉన్నంతకాలం దేహాభిమానాన్ని విడిచిపెట్టటం కష్టం. అందువలన చచ్చినవానివలె బ్రతుకు అప్పుడు జ్ఞానంవస్తుంది అనేవారు భగవాన్. కొంతమంది వారిలోఉన్నలోపం ఎవరికి తెలియకూడదు అనుకొంటారు, ఇతరులలోఉన్న చిన్నలోపాన్ని కొండంతగా చిత్రీకరిస్తారు. ఇది అజ్ఞానానికి గుర్తు. దీనికి తమోగుణం, రజోగుణం కారణం. ఇతరుల గొడవ నీకుఅనవసరం. నీలోఉన్నదోషంవలన నీకు జ్ఞానంరావటంలేదు. అందువలన గుడికివెళ్ళి ఆ దోషాలను తొలగించమని భగవంతుని ప్రార్థించాలి. సత్పురుషుల సహవాసం చేయటంవలన మనబుద్ధిలోఉన్న దోషాలు మనకు తెలియకుండానే రాలిపోతాయి. అధ్యయనం విషయంలో, శ్రవణంచేయటం విషయంలో అశ్రద్ధపనికిరాదు. విన్నది మీకు అర్థమయినా, కాకపోయినా అసలు వినటానికి వచ్చినందుకు భగవంతుడు కొన్నిమార్కులువేస్తాడు. శ్రవణంచేయటం ఒకభాగం, విన్నదానిని అర్థంచేసుకోవటానికి ప్రయత్నంచేయాలి అదిఒకభాగం, అర్థంచేసుకొన్న దానిని మనం ఎంతోకొంత ఆచరించాలి. మనంబాగుపడాలి, తరించాలి అని లోపలనుండి ప్రేరణవస్తూఉంటే అది ఈశ్వరానుగ్రహంవలన వస్తుంది.

జ్ఞానంయొక్క స్థానంలో ఎవరిని కూర్చోబెడదాం అనుకొంటున్నావు. నీధనాన్ని, నీగౌరవాన్ని, నీప్రతిభను ఆస్థానంలో కూర్చోబెడదాం అనుకొంటున్నావా? జ్ఞానంస్థానంలో కూర్చోపెట్టే వస్తువు ఈ సృష్టిలోఏదీలేదు. దానికి అదేసాటి. అది జ్ఞానంయొక్క గొప్పతనం. నీవు ఎలాపనిచేస్తే నీకు జ్ఞానం కలుగుతుందో అలాగపనిచెయ్యి. అదేనేర్పు, అదేఓర్పు అన్నాడు భగవంతుడు. మనం ఒకరితోఒకరు మాట్లాడుకోకపోయినా ఒకరిపట్ల ఒకరికి నిశ్శబ్దంలోనుండి అవగాహన రావాలి. అదినిజమైనప్రేమ. మీపట్లనాకు, నాపట్లమీకు అవగాహనఉండాలి. దానికి మీకు శాంతచిత్తంఉండాలి, నాకు శాంతచిత్తంఉండాలి. ఒకరిపట్లఒకరికి అవగాహన లేనప్పుడు మాటలుఅనవసరం. అవగాహనలోనుండి శాంతికలుగుతుంది. మీకుబాహ్యంగా ఎన్నిభోగాలుఉన్నప్పటికి శాంతిలేనివాడికి సుఖంలేదు. మాకు అన్నీఉన్నాయికాని శాంతిలేదుఅంటారు. జాగ్రత్తగా అర్థంచేసుకోండి. శాంతికావాలిఅని అడుగుతున్నారుకదా. నీలోపలఉండి ఎవడైతే శాంతినికోరుతున్నాడో వాడిని తీసేయండి అన్నారుభగవాన్. శాంతి బజారులోదొరకదు. నీలోపలఉండి ఎవడైతే శాంతినికోరుతున్నాడో ఆనేనును తీసివేస్తే ఇంకఉన్నదిశాంతే. ఆనేనుఉంటేనీకుశాంతిలేదు, అదిపోతేఅంతాశాంతే. ఈ క్లూ నీకు అర్థంఅవ్వాలి. శాంతిసముద్రం నీలోపలేఉంది, శాంతినికోరే ఆనేనును తీసివేస్తే అదిసడన్‌గాపొంగి నీ సహస్రారాన్ని ముంచుతుంది.

నీకు తలనొప్పివచ్చింది అనుకో. ఆ తలనొప్పి తగ్గేవరకూ నీకు పూర్వస్థితిరాదు. అలాగే నీకుఅజ్ఞానంవచ్చింది అజ్ఞానంపోయేవరకు లోపలఉన్న జ్ఞానంనీకు తెలియదు. అజ్ఞానంపోయినతరువాత అజ్ఞానం రాకముందు నీవు ఎలాగఉన్నావో అలాగఉంటావు. అజ్ఞానం ఉన్నంతకాలం నీవు ప్రయత్నంచేసినా అలాగ ఉండలేవు. నీకు శరీరంఅంటే ఎంతఇష్టంఉన్నా ఈ శరీరం నశించిపోతుంది ఎందుచేతనంటే అదినీవుకాదు. చనిపోయిన తరువాతకాదు ఇప్పుడుకూడా గాఢనిద్రలో ఎవరికి శరీరంగొడవలేదు. కానినీవుఉన్నావు. ఆఉన్నవాడినిపట్టుకో. నీదేహం ఎక్కడఉందో నీవుఅక్కడఉండవు. నీమనస్సు ఎక్కడఉందో నీవు అక్కడఉంటావు. నీమనస్సును తీసుకొనివచ్చి దేహంమీద పెట్టకు, నీహృదయంలోపెట్టు. అక్కడే భగవంతుడుఉన్నాడు. నీమనస్సును అక్కడఉంచితే అదితదాకారం చెందుతుంది, నీకు అమృతానుభవం కలుగుతుంది. కుండలు అనేక రకాలుగాఉండవచ్చుకాని మట్టిఒక్కటే. అలాగే నామాలు, రూపాలు, గుణాలు వేరువేరుగా ఉండవచ్చుకాని లోపలఉన్న పరమాత్మ ఒక్కడే. చనిపోయే వస్తువుతో తాదాప్యంవద్దు. చావులేనివస్తువు నీహృదయంలోఉంది. దానితో తాదాప్యంచెందు, దానితో స్నేహంచెయ్యి. లోకం ఒకట్రయినింగ్‌గ్రౌండ్. జ్ఞానం

సంపాదించుకొని ఇక్కడనుండి వెళ్ళిపోతేమంచిదే, జ్ఞానం సంపాదించుకోకుండావెళితే మరల ఇక్కడకు సిద్ధమవ్వవలసిందే. మనం దేహానికి, ఇంద్రియాలకు, మనస్సుకు వశం అవుతున్నాము. కాని మనం ఆత్మకు వశంఅవ్వాలి. మనస్సుకులోచూపురావాలి. వినయంఉన్నవాడికి లోచూపుకలుగుతుంది. స్వార్థం కొంచెం, కొంచెం తగ్గించుకొంటూరావాలి. దేహాభిమానం కొంచెం, కొంచెం తగ్గించుకొంటూరావాలి. అన్నీభ్రమలే, అన్నీభ్రాంతులే, అన్నీతలంపులే. లోపలఉన్నది ఒక్కటేపూర్ణం, అదిఒక్కటేనిజం. గాఢనిద్రలో తప్పించి మిగతా సమయంలో మనం దేహధ్యానలోఉంటున్నాము. దేహధ్యాస పెరిగేకొలది బంధంపెరుగుతుంది, చీకటిలోపడిపోతాము, జీవితంలో చివరకు మిగిలేది దుఃఖం, మానసిక అశాంతి, అనారోగ్యం. మనకు ఆత్మధ్యాసరావాలి. ఆత్మధ్యాసవలన ఆత్మజ్ఞానం కలుగుతుంది.

ఓం నమో భగవతే శ్రీరమణాయ నమః

రమణభాస్కర

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 14-10-01, విశాఖపట్నం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనస్సుఉన్నంతసేపు రూపం, నామం ఆకర్షిస్తుంది. హిందూమతంలో అనేకమంది దేవతాపురుషులు ఉన్నారు. మనకు ఎవరు ఇష్టంఅయితే ఆదేవుడిని ఆరాధించుకోవచ్చు. మనం పవిత్రులు అవ్వటానికే ఈఆరాధనలు, పూజలు, ఉపాసనలు. ఏదైనా ఉద్యోగానికి వెళ్ళినప్పుడు మనకు అర్హతఉందో, లేదోచూస్తారు. అలాగే ఈశ్వరుడు మనకు మోక్షలక్ష్మిని ప్రసాదించేముందు మనకు ఎంతవరకు అర్హతఉంది, పవిత్రతఉంది అనిచూస్తాడు. అహంకారి ఎప్పుడూ నామరూపాలమధ్య తిరుగుతూఉంటాడు, వాటిలో చిక్కుకొంటాడు. వాడు నామరూపాలను దాటలేడు. అహంకారంలేనివాడు నామరూపాలమధ్య తిరుగుతూఉన్నా, నామరూపాలకు ఆధారంగాఉన్న చైతన్యాన్నే దర్శిస్తూఉంటాడు. శరీరము, వాక్కు, మనస్సు శుచిగాఉండాలి. ఎప్పుడైతే మనం శుచిగాఉన్నామో అప్పుడు ఈశ్వరునిచేత ఆకర్షింపబడతాము. మనకు తగినంత అంతఃకరణశుద్ధిలేదు, శుద్ధిలేకపోతే సిద్ధికలుగదు. అంతఃకరణశుద్ధి సంపాదించటానికే ఉపాసన ఏర్పాటుచేసారు. సత్యవస్తువు మన హృదయంలోనేఉంది. కాని మనం ఆవస్తువుచేత ఆకర్షింపబడలేకపోతున్నాము. దీనికి





మన మనస్సులోఉన్న కాలుష్యం, మనఅలవాట్లు కారణం. ఆవస్తువు ఎంత నిర్మలంగాఉందో, ఎంతపవిత్రంగాఉందో, ఎంతసహజంగాఉందో మన మనస్సుకూడా అలాతయారయితే ఆవస్తువుచేత ఆకర్షింపబడతాము, అప్పడు అది నీకువ్యక్తమవుతుంది.

గురువుఅంటే చీకటిని తొలగించేవాడు. బయట చీకటిని సూర్యుడు పోగొడతాడు. లోపలచీకటిని అంటే అజ్ఞానాన్ని తొలగించేవాడే గురువు. ఈశ్వరుడు గురురూపం ధరించివస్తాడు. అంటే ఈశ్వరుని ఆరాధించి, ఆదాధించి ఆయన అనుగ్రహానికి పాత్రులయితే ఈశ్వరుడే శరీరం ధరించివస్తాడు, వాడే గురువు. ఈశ్వరుడికి గురువుకి భేదంలేదు. మనం ప్రయాణం చేసేటప్పుడు ట్రాఫిక్‌జామ్‌లువస్తాయి. పోలీసువారు వచ్చి దానిని క్లియర్‌చేయాలి. లేకపోతే మన ప్రయాణంసాగదు. అలాగే మనం సాధనచేసేటప్పుడు మన మనస్సులోఉన్న బలహీనతలు, అలవాట్లు అడ్డువస్తాయి. ఆ అడ్డంకులను క్లియర్‌చేసి మనలను ముందుకు నడిపించేవాడే గురువు. మాటకంటే మౌనం బలీయమైనది. మనస్సు అణిగినచోటనుండి మౌనంవస్తుంది. జ్ఞానియొక్క మౌనం అనేకమంది జీవితాలలో మార్పు తీసుకొనివస్తుంది.

**మహావాక్యాలు, వాటి అర్థనిర్ణయాలు అంతులేని చర్చలకు దారితీసి సాధకుల మనస్సులను బహిర్ముఖంగా ప్రసరింపజేస్తూ వుంటాయి. మనస్సును అంతర్ముఖం చెయ్యాలంటే సాధకుడు సూటిగా "నేను"లో నిలకడ సంపాదించుకోడం అవసరం. బాహ్యప్రవృత్తు లంతరించి అతనికప్పుడు పరమశాంతి చేకూరుతుంది.**

**- భగవాన్ శ్రీ రమణమహర్షి**

జీవితంపట్ల వారికి సరియైన అవగాహన కలుగజేస్తుంది. ఎలా జీవిస్తే వారికి జ్ఞానంకలుగుతుందో ఆడైరెక్షన్ మౌనంలోనుండి వస్తుంది. మౌనభాష అర్ధంకావాలంటే మనకు లోపల తగిన పక్వతఉండాలి. మనం బుద్ధితో కొన్నివిషయాలు గ్రహిస్తాము. మీకుఎంత అవగాహనశక్తిఉన్నా, మీరుఎంతమేధావులుఅయినా మీలోపలఉన్న శాంతిసముద్రం మీఅవగాహనకు అందదు. మీరు పుస్తకంచదివి అర్ధంచేసుకోవచ్చు, లెక్కచేసి అర్ధంచేసుకోవచ్చు. కాని మీలోపలఉన్న సత్యవస్తువు మీమేధస్సుకు అందేదికాదు, అదిఅనుభవైకవేద్యం, అది అనుభవానికి మాత్రమే అందుతుంది. గురువు సమక్షంలోఉన్నప్పడు మీప్రయత్నంతో సంబంధంలేకుండా మారుమనస్సుపొందుతారు, హృదయంలోఉన్న చల్లదనం మీకుతెలుస్తుంది. మాయకు దూరంగా, అహంకారానికి దూరంగా జీవించగలుగుతారు. మానవుడు అహంభావికాకుండా ఎన్ని ప్రయత్నాలుచేయాలో అన్ని ప్రయత్నాలు గురువుచేస్తూ ఉంటాడు. గురువుచేసే ముఖ్యమైన పనిఅదే. గురువుచేసేపని మనకళ్ళకు కనబడకపోవచ్చు, ఇప్పడు దానిని మనం గ్రహించలేకపోవచ్చు. కాని లోపలఉన్నవస్తువు మనకు అనుభవంలోనికి వచ్చాక గురువుచేసిన సహాయసహకారములు మనకు తెలుస్తాయి.

మనం అహంకారంతోటి, గర్వంతోటి, కర్తృత్వంతోటి ఏపనిచేసినా పోష్టాఫీసువారు ఉత్తరాలమీద ఎలా ముద్రలువేస్తారో అలాగ మన మనస్సుమీద ముద్రలుపడతాయి. ఈ ముద్రలేమనలనుబంధిస్తాయి, ఈముద్రలే పునర్జన్మకు కారణాలుఅవుతాయి. కర్మచేసేటప్పడు కర్మఫలం నిన్ను అంటకూడదు అది తెలుసుకొని కర్మచెయ్యి. తలంపులవిషయంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. మనతలంపులే మనలను బంధిస్తాయి. తలంపునుబట్టి మాటవస్తుంది, తలంపునుబట్టి పనిచేస్తాము. వీరుమంచివారు, వీరుచెడ్డవారు, వీరుగొప్పవారు, వీరుతక్కువవారు అని ఇలా ఏదోఒకటి అనుకొంటూఉంటాము. ఈతలంపులే మనలను బంధిస్తున్నాయి, ఇవే మనలను నరకానికి తీసుకొనివెళుతున్నాయిఅని మనకు అర్ధంకావటంలేదు. మూలతలంపుమూలంలో భగవంతుడు ఉన్నాడు. మూలతలంపును దానిమూలంలోనికి పంపాలి. మామూలుగా శాస్త్రాన్ని అధ్యయనం చేయటంవలన నీవు మూలతలంపుమూలంలోనికి వెళ్ళలేవు. వైరాగ్యాన్ని పెంచుకొని మూలతలంపును దానిమూలంలోనికి పంపితే అక్కడ అది కరిగిపోతుంది, అప్పడు భగవంతుడు నీకు స్వరూపంగావ్యక్తమవుతాడు. నీసాధనను, నీభక్తిని పూజగదికి పరిమితం చేయవద్దు. నీజీవితం





నార్మల్గాఉంటే, సహజంగాఉంటే జ్ఞానంవచ్చి నిన్ను వరిస్తుంది అన్నారు భగవాన్.

మనదేహంఅంటే మనకు చాలాఇష్టం. దానికి చాలాఎక్కువచాకిరీచేస్తాము. చాలాటైము మనదేహానికి ఖర్చుపెడతాము. ఆమాత్రంటైము మీమనస్సుపవిత్రంఅవ్వటానికి ఖర్చుపెడితే మీకు ఆత్మానుభవంకలుగుతుంది. శ్రవణంచేయటంకూడా జ్ఞానసముపార్జనలోభాగమే. విసుగులేకుండా, శ్రద్ధగా శ్రవణంచేయాలి. శ్రవణంచేసిన వాటిలో మీకునచ్చిన వాక్యాలుఉంటే వాటిని ఇంటిదగ్గర ధ్యానంచేయాలి. అలా ధ్యానంచేయగాచేయగా ఆవాక్యం మీబ్రెయిన్లోనుండి హృదయంలోనికి వస్తుంది. హృదయంలోనికి వచ్చాక ఆవాక్యంతాలుక అర్ధం, దాని ఎసెన్స్ మీకుసొంతమవుతుంది, అదిమీకు జ్ఞానాన్ని పట్టిఇస్తుంది. జీవితంలో హెచ్చుతగ్గులువస్తూఉంటాయి, సన్మానాలువస్తాయి, అవమానాలువస్తాయి, జీవితంఎప్పడూ ఒకలాగఉండదు. మనం లోపలశాంతిని కాపాడుకొంటే ప్రారబ్ధం మీకు అనుకూలంగాఉన్నా, ప్రతికూలంగాఉన్నా మీకు రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి. లోపలశాంతిని కాపాడుకోవటంవలన కొత్తసంస్కారములురావు, పాతసంస్కారములుపోతాయి. కొంతమంది ఏమిచేస్తారుఅంటే ఎవరికైనా అభిప్రాయబేధాలుఉంటే వాటిని అర్ధంచేసుకొని వాటిని సరిచేయటానికి చూస్తారు, వారు ఈశ్వరానుగ్రహానికిపాత్రులవుతారు. సమాధానపరుచువారు ధన్యులు వారుదేవునిచూచెదరు అని ఏసుచెప్పారు.

మనలోపలఉన్న సద్వస్తువుకు మరణంలేదు. అది ఎప్పడుఉంటుంది. దేహంఉన్నాఉంటుంది, దేహంలేకపోయినా అదిఉంటుంది. అది మనమైఉన్నాము అందువలననే మనకు ఎప్పడూ ఉండాలనిఉంటుంది. అదిమనకు అనుభవంలోనికి వచ్చినప్పడు దేహం మరణించినా మనకు దుఃఖంరాదు ఎందుచేతనంటే దేహం మరణించినా మనంఉంటాముఅని మనకు తెలుస్తుంది, అప్పడు మరణాన్నిజయిస్తాము. ఈమధ్య ఒకరు ఆయన బాధలగురించి చెపుతూఉంటే భగవంతుని స్మరించుకోండిఅనిచెప్పాను. నాబాధలు తలపెట్టుకోవటానికే నాకు టైముచాలటంలేదు ఇంక దైవస్మరణకు నాకుటైముఎక్కడఉంది. నాబరువేనేనుమోయలేకపోతున్నాను, మీరుఇంకోకొత్తబరువుపెడుతున్నారు. మీకు చేతనైతే నాబరువుదించాలికాని మీరు బరువునుఇంకాపెంచుతున్నారు అన్నాడు. భగవంతుడిని స్మరించటంవలన ఆబాధలుపల్చబడతాయి, వాటిలోనుండి ఎలాబయటపడాలో లోపలనుండి

గైడెన్స్ వస్తుంది అది ఆయనగ్రహించటంలేదు.

రాముడిని నిరంతరం స్మరిస్తూఉంటే రాముడి గుణాలుఅన్నీ మనకువస్తాయి. నిరంతరం రావణాసురుడిని స్మరిస్తూఉంటే రావణాసురుడు గుణాలుఅన్నీ మనకువస్తాయి. సత్పురుషులను నిరంతరం స్మరిస్తూఉంటే ఆ సహృదయం మనకువచ్చేస్తుంది. మీరు నిరంతరం భగవంతుని స్మరించటంవలన, ధ్యానించటంవలన మీరు

**సత్సంగ మనగా సద్వస్తువుతో కలిసి ఉండడం. సద్వస్తువు నిజానికి ఒక్క ఆత్మయే. కాని, అది తెలుసుకోలేనంతకాలం, తెలిసికొన్న సత్పురుషులతో కలిసి ఉండడమే సత్సంగమవుతుంది. ఆ సత్సంగం అంతర్ముఖత్వానికి దారితీసి ఆత్మసాక్షాత్కారాన్ని కలిగిస్తుంది.**

**- భగవాన్ శ్రీ రమణ మహర్షి**





పరమపవిత్రులుఅవుతారు, మీకు తెలియకుండానే మీమనస్సు దానంతటఅదే జారిపోతుంది. మనంచేసేప్రయత్నాలు, సాధనలుఅన్నీ చిత్తశుద్ధికోసమే. ఎక్కడయితే భగవంతుడు ఉన్నాడో అక్కడకు వెళ్ళటానికి మనం చిత్తశుద్ధి అనేగేటుద్వారానే ప్రవేశించాలి. మనం ప్రయత్నంచేసి ఈ ప్రపంచంలోఉన్న సంపదను అంతా మనం సంపాదించినా మనకు చిత్తశుద్ధి లేకపోతే అది ఒకటిలేని సున్నలతో సమానము. లోపల శ్రద్ధఉంటే మనకు జ్ఞానంవచ్చేస్తుంది. ఉండవలసినంతశ్రద్ధ లేకపోతే మనస్సు ఏదోవంపుపెడుతుంది. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం జ్ఞానసముపార్జనకు సహకరిస్తాయి. విగ్రహారాధనలు, నదులలో మునగటాలు ఇవిఅన్నీకూడా పరమపవిత్రుడిచూపుతో సరికాదు. సత్పురుషులను దర్శించటంవలన నీవు ప్రభావితుడవుఅవుతావు. వారుపొందినస్థితిని మనంకూడాపొందాలి అనే ప్రేరణ నీకు లోపలనుండివస్తుంది. మహాత్ములను దర్శనంవలన వారిలోఉన్న జ్ఞానాగ్ని మనలోఉన్న అజ్ఞానానికి నిప్పపెడుతుంది. అజ్ఞానంపూర్తిగా కాలటానికి కొంతటైము పట్టవచ్చుకాని ముందు అజ్ఞానం కాలటం ప్రారంభమవుతుంది. మహాత్ముల సమక్షంలో వాసనలు అణుగుతాయి, మనస్సు అణుగుతుంది అంతేకాదు సమాధిస్థితి వచ్చేస్తుంది. హోలీకంపెనీ అటువంటిది. సత్పురుషుల సహవాసంకోసం అవసరమైతే భూమియొక్క అంచులదాకా ప్రయాణంచెయ్యిఅని ఐన్‌స్టీన్‌చెప్పారు. ఇది సత్యం ఇదిఅసత్యం, ఈమాట మనకు ఉపయోగపడుతుంది, ఈమాట మనకు ఉపయోగపడదు, ఈస్నేహం మనకుమంచిది, ఈస్నేహం మనకుమంచిదికాదుఅని తెలియటానికి మనకు వివేకంఉండాలి. అందువలన వివేకాన్ని జీవితంపొడుగునా కాపాడుకోవాలి. మీరు కర్మమార్గంలో ప్రయాణంచేయండి, భక్తిమార్గంలో ప్రయాణంచేయండి, జ్ఞానమార్గంలోప్రయాణంచేయండి, లేకపోతే అన్నిమార్గాలను సమన్వయంచేసుకొని ప్రయాణంచేయండి. ఏదోరకంగా ప్రయాణంచేసి ఈదొంగనేనులోనుండి, దేహగతమైననేనులోనుండి విడుదలపొందండి. నిజమైన గురువు నీకు మాటలుచెప్పి విడిచిపెట్టడు, నిన్నుఅనుగ్రహిస్తూఉంటాడు. ఏవస్తువును పొందమని నీకు బోధిస్తున్నాడో ఆవస్తువు నీకు అనుభవంలోనికివచ్చేవరకు నిన్నువెంటాడుతూఉంటాడు. వాడుగురువు.

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | | |
|---|---|---|---|
| 21-10-2001 | ఆది | పెదఅమిరం | ముదునూరి అబ్బాయిరాజు గారి ఇంటివద్ద |
| 24-10-2001 | బుధ | శృంగవృక్షం | అమ్మవారి గుడి |
| 26-10-2001 | శుక్ర | భీమవరం | తాడేరు రోడ్డు - యోగా స్కూల్ ప్రారంభోత్సవం |
| 28-10-2001 | ఆది | కైకలూరు | టి.టి.డి. కళ్యాణమండపం |
| 30-10-2001 | మం | నర్సాపురం | పార్కురోడ్డు, శిరిడి సాయిబాబా గుడి |
| 04-11-2001 | ఆది | జిన్నూరు | శ్రీ రమణక్షేత్రం |
| 28-11-2001<br>టు 5-12-2001 | | అరుణాచలం | కేంపు |
| 30-11-2001 | శుక్ర | అరుణాచలం | దీపోత్సవం |

## శ్రీ జడ్డు బ్రహ్మాజీరావు, శ్రీమతి సూర్యకాంతం సేవాకేంద్రం, తాడేరు రోడ్డు, గునుపూడి, భీమవరం



**ది. 26-10-2001 విజయదశమి శుక్రవారం**

**సాయంత్రం గం॥ 3-15 ని॥లకు**

**సద్గురు శ్రీ నాన్నగారిచే** శ్రీ విఘ్నేశ్వర విగ్రహ ఆవిష్కరణ

మరియు **యోగ, వేద, విద్యా కేంద్ర భవనసముదాయము**

ప్రారంభించబడును

## శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహ పున:ప్రతిష్టాపన కార్యక్రమము

**పార్కు రోడ్డు, నరసాపురం**



**ది. 29-10-2001 సోమవారం ఉదయం గం॥ 8-20 ని॥లకు**

**శ్రీ షిరిడి సాయిబాబా వారి విగ్రహ ప్రాణప్రతిష్ట**

**సద్గురు శ్రీ నాన్నగారిచే జరుపబడును**

**విఘ్నేశ్వర విగ్రహ ప్రతిష్ట :**

శ్రీ గౌ॥ కొత్తపల్లి సుబ్బారాయుడు గారు (రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు)

**నందీశ్వర ప్రతిష్ట :**

శ్రీ గౌ॥ కొత్తపల్లి జానకిరామ్ గారు (Ex-MLA.,)

**దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ట :**

శ్రీ గౌ॥ కొప్పర్తి వేణుగోపాలరావు గారు (మునిసిపల్ చైర్మన్)